క్లుప్తంగా

పీఠంలో మాఘ పౌర్ణమి పూజలు


ప్రత్యేక అలంకరణలో విజయదుర్గా అమ్మవారు

రాయవరం: వెదురుపాక విజయదుర్గా పీఠంలో ఆదివారం మాఘ పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించి, సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అర్చకుడు చీమలకొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. మాఘ పౌర్ణమి విశిష్టతను విజయదుర్గా పీఠాధిపతి వాడ్రేవు వెంకటసుబ్రహ్మణ్యం(గాడ్) భక్తులకు వివరించారు. అన్నసమారాధనను నిర్వహించారు. ఈ కార్యక్రమాలను పీఠం అడ్మినిస్ట్రేటర్ బాపిరాజు, పీఆర్‌ఓ వేణుగోపాల్, సేవా సమితి ప్రతినిధులు భాస్కరనారాయణ, సత్య వెంకటకామేశ్వరి, సత్య కనకదుర్గ తదితరులు పర్యవేక్షించారు.

బసవేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం


బసవేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

రాయవరం: స్థానిక బసవేశ్వర స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ ఆలయాన్ని ఏడాది క్రితం దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పునః నిర్మించారు. ఆదివారం స్వామి వారికి వేకువజాము నుంచి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయల కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన జరిపారు. వేడుకల్లో ఆలయ కమిటీ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నల్లూరులో పోలేరమ్మ తీర్థం


పోలేరమ్మను దర్శించుకుంటున్న భక్తులు

కపిలేశ్వరపురం: నల్లూరు గ్రామ దేవత పోలేరమ్మ తీర్థం ఆదివారం వైభవంగా సాగింది. ఆలయం వద్ద శనివారం రాత్రి జాతర నిర్వహించారు. గరగ నృత్యాలు, డప్పు వాయిద్యాలతో అమ్మవారిని గ్రామ వీధుల్లో ఊరేగించారు. ఆదివారం సెలవు దినం కావడంతో ఆలయం వద్ద నిర్వహించిన తీర్థంలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆడపడుచులు అమ్మవారికి మొక్కులు సమర్పించుకున్నారు.

వెంకటలక్ష్మికి సత్కారం


వెంకటలక్ష్మిని సత్కరిస్తున్న సర్పంచ్ దొరబాబు, వైస్ ఎంపీపీ శాకా బాబీ తదితరులు

రామచంద్రపురం రూరల్: కాకినాడ జీజీహెచ్‌లో ఏఎన్ఎంగా పని చేస్తున్న అన్నాయిపేటకు చెందిన దూళి వెంకటలక్ష్మిని ఆదివారం ఘనంగా సత్కరించారు. కరోనా సమయంలో ఆమె అందించిన సేవలను పురస్కరించుకుని గ్రామస్తులు ఆమెను సన్మానించారు. గ్రామ సర్పంచ్ పెమ్మిరెడ్డి దొరబాబు, ఉప సర్పంచ్ చల్లా బుజ్జి, వైస్ ఎంపీపీ శాకా చంద్రశేఖరసూర్యప్రకాశ్(బాబీ), వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

వేణుగోపాలునికి గరుడోత్సవం

రాయవరం: సోమేశ్వరంలో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామికి ఆదివారం గరుడోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సోమేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ గరగ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకుడు పెద్దింటి శేషాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భీష్మ ఏకాదశి అనంతరం ఐదో రోజు నాగ పౌర్ణమిని పురస్కరించుకుని ఏటా స్వామి వారికి గరుడోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఉదయం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు, అభిషేకాలు, చక్రస్నానం నిర్వహించారు. సాయంత్రం గరుడవాహనంపై దేవేర్లతో ఊరేగించారు. ఈ గ్రామోత్సవంలో సర్పంచ్ ఆరిఫ్, సోమేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ గరగ వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ చైర్మన్ నల్లమిల్లి వీర్రాఘవరెడ్డి, ఆలయ ఈవో ఎస్.అయ్యప్పరాజు, భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గంధోత్సవం

రామచంద్రపురం: పట్టణంలోని జెండా వీధిలో ఉన్న హజరత్ మౌలాలీ ముష్కల్ కుషా దర్గా వద్ద ఆదివారం 37వ పవిత్ర గంధోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తొలుత ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పవిత్ర గంధంతో గ్రామోత్సవం నిర్వహించి దర్గాకు చేరుకున్న అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. నిరుపేదలకు దుస్తులు అందజేశారు. పట్టణంతో పాటు జిల్లా నలుమూలల నుంచి భక్తులు విచ్చేసి మొక్కులు చెల్లించుకున్నారు. గంధోత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరిగింది.

ఆరోగ్యమస్తు..

- ఫలిస్తున్న 'వైఎస్సార్ సంపూర్ణ పోషణ'
- తగ్గుతున్న పౌష్టికాహార లోపం
- గర్భిణులు, బాలింతల ఆరోగ్యానికి భరోసా
- క్లస్టర్ పరిధిలో 6,414 మంది గర్భిణులు, బాలింతలు


వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు లబ్ధిదారులకు అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

రాయవరం: గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యమే లక్ష్యంగా రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం చేపట్టిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్, వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాలు మంచి ఫలితాలనిస్తున్నాయి. ఈ పథకాల వల్ల ప్రభుత్వం ఆశించిన లక్ష్యాలు క్షేత్ర స్థాయిలో కన్పిస్తున్నాయి.

సత్ఫలితాలిస్తున్న సంపూర్ణ పోషణ

చిన్నారుల్లో పౌష్టికాహార లోపాన్ని నివారించేందుకు ప్రభుత్వం చేపట్టిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ సత్ఫలితాలు ఇస్తోంది. క్రమక్రమంగా దీని ఫలితాలు ఆశించిన మేర కన్పిస్తున్నాయి. పేదరికం వల్ల గర్భిణులు సరైన పౌష్టికాహారాన్ని తీసుకోలేక పోతున్నారు. ఫలితంగా పుట్టిన బిడ్డలు పౌష్టికాహార లోపంతో బాధపడుతూ అనేక వ్యాధులకు గురవుతున్నారు. సరైన ఎదుగుదలకు నోచుకోవడం లేదు. దీన్ని గుర్తించిన ప్రభుత్వం నివారణకు చర్యలు చేపట్టింది. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు బలమైన పౌష్టికాహారాన్ని అందించేందుకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్, వైఎస్సార్ సంపూర్ణ పోషణ వంటి పథకాలను చేపట్టింది.


వైఎస్సార్ సంపూర్ణ కిట్‌లో వస్తువులు

వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ పథకాన్ని గిరిజన ప్రాంతాల్లో అమలు చేస్తుండగా, వైఎస్సార్ సంపూర్ణ పోషణను మైదాన ప్రాంతంలో కూడా చేపట్టింది.

రేషన్ పంపిణీ ఇలా

గర్భిణులు, బాలింతలకు రాగి పిండి ఒక కేజీ, బెల్లం 250 గ్రాములు, వేరుశనగ చిక్కి 250 గ్రాములు, సజ్జ లేదా జొన్న పిండి కేజీ, అటుకులు కేజీ, రోజుకు 200 ఎంఎల్ వంతున నెలకు ఐదు లీటర్లు ఇస్తారు. ఆరు నెలల నుంచి మూడేళ్ల పిల్లలకు బాలామృతం 2.5 కేజీలు, కోడిగుడ్లు 25, పాలు 2.5 లీటర్లు ఇస్తారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు రోజుకో మెనూతో ఆహారాన్ని వండి అందజేస్తున్నారు. సోమవారం అన్నం+దోసకాయపప్పు, కోడిగుడ్డు కూర, మంగళవారం అన్నం+పప్పు, టమాటా, కోడిగుడ్డు కూర, బుధవారం అన్నం+ఆకుకూర, పప్పు, కోడిగుడ్డు కూర, గురువారం ఎగ్ ఫ్రైడ్ రైస్, ఆకుకూర, శుక్రవారం అన్నం+పప్పు, ఆకుకూర, కోడిగుడ్డు కూర, శనివారం వెజిటబుల్ రైస్, ఆకు కూర, సాంబారు మెనూ రూపంలో అందజేస్తున్నారు. ఒక్కొక్కరికీ బియ్యం 125 గ్రాములు, 30 గ్రాముల కందిపప్పు, 16 గ్రాముల ఆయిల్ కేటాయిస్తున్నారు. కోడిగుడ్డు కూర ఉన్న రోజు కాకుండా మిగిలిన రోజుల్లో ఉడికించిన కోడిగుడ్డు మెనూలో అందజేస్తున్నారు.

క్లస్టర్ పరిధిలో లబ్ధిదారులు

మండపేట, అనపర్తి, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలోని రాయవరం, కపిలేశ్వరపురం, మండపేట, అనపర్తి, బిక్కవోలు, పెదపూడి, రంగంపేట, రామచంద్రపురం, కె.గంగవరం, కాజులూరు మండలాలు కపిలేశ్వరపురం, రాయవరం, రంగంపేట ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో ఉన్నాయి. ఈ ప్రాజెక్టుల పరిధిలో మూడు నుంచి ఆరేళ్ల లోపు చిన్నారులు 16,497 మంది, 3,218 మంది బాలింతలు, 3,196 మంది గర్భిణులు ఉన్నారు. వీరంతా వైఎస్సార్ సంపూర్ణ పోషణలో లబ్ధిదారులుగా ఉన్నారు.

సత్ఫలితాలు



వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. అన్ని రకాల పోషకాలతో కూడిన ఆహారాన్ని ప్రభుత్వం అందిస్తోంది. ఇది రక్తహీనత నివారణకు, పౌష్టికాహార లోపాన్ని తగ్గించడానికి ఉపయోగపడుతుంది.

– వజ్రపు వరాహలక్ష్మి, పీవో, ఐసీడీఎస్, రాయవరం ప్రాజెక్టు

జనసేనకు బై.. వైఎస్సార్ సీపీకి జై..


అచ్యుతాపురంలో వైఎస్సార్ సీపీలో చేరిన జనసేన నాయకులు

కపిలేశ్వరపురం: అచ్యుతాపురం గ్రామానికి చెందిన జనసేన నాయకులు నౌంగ్రు చిన్నోడు, తాతపూడి సుబ్రహ్మణ్యం, తాతపూడి విజయ్ కుటుంబ సభ్యులు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సమక్షంలో శనివారం రాత్రి వైఎస్సార్ సీపీలో చేరారు. పేదల సంక్షేమానికి అమలు చేస్తున్న పథకాలు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన తీరును చూసి ఆకర్షితులై పార్టీలో చేరినట్టు వారు తెలిపారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో వారు తమ నిర్ణయాన్ని చెప్పగా వారికి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పార్టీ కండువాలను వేసి స్వాగతం పలికారు. ప్రజలకు సేవ చేస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్సీ తోట సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర కమ్మకార్పొరేషన్ డైరెక్టర్ చుండ్రు చిట్టిబాబు, జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, ఎంపీటీసీ సభ్యుడు, గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పలివెల మధు, వైఎస్సార్ సీపీ నాయకులు చుండ్రు అమ్మన్న పాల్గొన్నారు.

మసకపల్లిలో కంటి వైద్య శిబిరం

కె.గంగవరం: మసకపల్లి గ్రామంలో బ్రహ్మపూరి సొసైటీ వద్ద ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. సొసైటీ అధ్యక్షుడు మేడిశెట్టి వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కంటి వైద్య శిబిరాన్ని రాష్ట్ర బీసీ సంక్షేమ, సమాచార, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ తనయుడు చెల్లుబోయిన నరేన్, ఎంపీపీ పంపన నాగమణి రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. అనంతరం ఏలూరుకు చెందిన ఆశ్రమ కంటి ఆసుపత్రి సిబ్బంది కంటి రోగులకు ఉచితంగా పరీక్షలు చేశారు. కంటి ఆపరేషన్ అవసరమైన వారిని గుర్తించి ఉచితంగా ఆపరేషన్ చేసేందుకు రోగులకు ఆసుపత్రికి తరలించారు. సచివాలయల మండల కన్వీనర్ తోకల శ్రీను, వైఎస్సార్ సీపీ నాయకులు కట్టా తిరుమలు, కాదా గోవిందు, పంపన సుబ్బారావు, మేడిశెట్టి శేషారావు, రవ్వా భూషణం తదితరులు పాల్గొన్నారు.


కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మంత్రి తనయుడు నరేన్, ఎంపీపీ నాగమణి తదితరులు

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

కె.గంగవరం: శివల గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ద్రాక్షారామకు చెందిన సీహెచ్ దేవానందం ఆధ్వర్యంలో జరిగిన ఉచిత వైద్య శిబిరాన్ని మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ ఇళ్ల సూర్యనారాయణ ప్రారంభించారు. అనంతరం పీఎంపీ వైద్యులు దేవానందం గ్రామంలో సుమారు 125 మందికి ఉచితంగా బీపీ, సుగర్‌తో పాటు పలు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శల దుర్గాప్రసాద్, సత్యనారాయణ, తిమ్మరాజు తదితరుల పాల్గొన్నారు.

ఘనంగా సత్తెమ్మతల్లి సంబరం

మండపేట: పట్టణంలోని గొల్లపుంత కాలనీలో ఉన్న సత్తెమ్మతల్లి అమ్మవారి సంబరం ఆదివారం ఘనంగా జరిగింది. మూడు రోజులుగా జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా చివరి రోజున గరగ నృత్యాలతో గ్రామోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. కాలనీవాసులతో పాటు మండపేట నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కౌన్సిలర్ మొండి భవాని, వైఎస్సార్‌సీపీ నాయకులు జిన్నూరి సాయిబాబా, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి : గొల్లపుంత కాలనీలోని సత్తెమ్మ తల్లి ఆలయం అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. ఆలయ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను ఆలయ కమిటీ సభ్యులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ప్రస్తుతం ఉన్న షెడ్డు స్థానంలో స్లాబ్ నిర్మాణం చేయాల్సి ఉందని తెలుపగా ఎమ్మెల్సీ తోట సానుకూలంగా స్పందించారు.


అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ తోట, చైర్‌పర్సన్ దుర్గారాణి తదితరులు

అదనపు తరగతి గదులకు భూమిపూజ


భూమిపూజ చేస్తున్న సర్పంచ్ సౌజన్య, అశోక్‌కుమార్ దంపతులు

మండపేట: మెర్నిపాడులో పాఠశాల అదనపు తరగతి గదుల నిర్మాణానికి సర్పంచ్ గారపాటి సౌజన్య, వైఎస్సార్ సీపీ నేత అశోక్‌కుమార్ దంపతులు ఆదివారం భూమిపూజ చేశారు. నాడు-నేడు పథకం కింద రూ.25లక్షలతో గ్రామంలోని మండల పరిషత్ పాఠశాలలో నూతనంగా అదనపు తరగతి గది, కిచెన్ గది తదితర నిర్మాణాలు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా సౌజన్య, అశోక్‌కుమార్ దంపతులు మాట్లాడుతూ పేదల విద్యకు పెద్దపీట వేస్తూ ప్రభుత్వ పాఠశాలలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్పొరేట్‌కు దీటుగా అభివృద్ధి చేస్తున్నారన్నారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సహకారంతో గ్రామంలో ఎన్నో దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించుకోగలిగామన్నారు. పుంత రోడ్డును బైపాస్ రోడ్డుగా అభివృద్ధి చేసుకోవడంతో పాటు సచివాలయం గ్రాంటు రూ.18 లక్షలతో కాలనీలో మౌలిక వసతులు కల్పించామన్నారు. మరెన్నో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించామని పేర్కొన్నారు. గ్రామ కార్యదర్శి వి.వర్మ, పీఏసీఎస్ చైర్మన్ కె.రాజేష్, పంపన బుల్లియ్య, ముత్యాల పెద్దబ్బు, చల్లా మోహన్, గారపాటి రాంబాబు, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సోమేశ్వరుని కల్యాణం

కె.గంగవరం: అముజూరులోని పార్వతీ సమేత సోమేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఆలయ అర్చకులు వెలవలపల్లి సత్య ఆరుణ్‌శర్మ ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణ క్రతువులు నిర్వహించారు. మహోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయం వద్ద భక్తుల విరాళాలతో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులతో పాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం సోమేశ్వర స్వామివారి శ్రీపుష్పయోగం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

400 మందికి వైద్య పరీక్షలు


శిబిరంలో పరీక్ష చేయించుకుంటున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం పక్కన ఉన్న శ్రీసాయి ఆర్థో, ట్రామా కేర్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 400 మందికి వైద్యసేవలు అందించారు. ఆస్పత్రి అధినేత డాక్టర్ రాము ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి ప్రారంభించారు. పేదల ఆరోగ్య పరిరక్షణకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడంపై డాక్టర్ రామును ఆమె అభినందించారు. బీపీ, షుగర్, గుండె, ఎముకలు, గైనిక్ తదితర విభాగాలకు చెందిన వైద్యనిపుణులు రోగులకు వైద్యసేవలు అందించారు. అవసరమైన ఈసీజీ, బీఎండీ, షుగర్ రక్త పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. దాదాపు రూ.80 వేల విలువైన మందులు, రక్త పరీక్షలు నిర్వహించారు. కౌన్సిలర్ మొండి భవాని, వైఎస్సార్ సీపీ నేత పెంకే గంగాధర్, భూషణం, బీజేపీ నేత కోన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శివతేజ తల్లిదండ్రులకు సత్కారం


అన్నాయిపేటలో కాకిలేటి సూరిబాబు దంపతులను సత్కరిస్తున్న నాయకులు, పెద్దలు

రామచంద్రపురం రూరల్: రొమ్ము కేన్సర్‌ను ముందుగానే గుర్తించే సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేసిన కాకిలేటి శివతేజ తల్లిదండ్రులకే కాకుండా గ్రామానికే గర్వకారణం అని వైస్ ఎంపీపీ శాకా చంద్రశేఖర సూర్యప్రకాశ్(బాబీ), గ్రామ సర్పంచ్ పెమ్మిరెడ్డి దొరబాబులు అన్నారు. అన్నాయిపేటలో కాకిలేటి శివతేజ తల్లిదండ్రులు కాకిలేటి సూరిబాబు, సత్యకాంతం దంపతులను దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. వారికి గ్రామం తరపున జ్ఞాపిక అందజేశారు. ఈ సత్కార కార్యక్రమానికి ఉపాధ్యాయుడు అరవ విస్సు వాఖ్యాతగా వ్యవహరించారు. కార్యక్రమంల గ్రామ ఉప సర్పంచ్ చల్లా బుజ్జి, పంచాయతీ పాలకవర్గం, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బూత్ స్థాయిలో పటిష్టం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న కర్రి చిట్టిబాబు

కాజులూరు: బీజేపీని బూత్ లెవెల్‌లో పరిష్టం చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కర్రి చిట్టిబాబు అన్నారు. మండలంలోని కుయ్యేరులో జరిగిన పార్టీ కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ బూత్ లెవెల్‌లో పార్టీ పటిష్టానికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లా ప్రధాన కార్యదర్శి దూడల శంకరనారాయణ, మండల అధ్యక్షుడు సలాది వీరబాబు, సోషల్ మీడియా కన్వీనర్ రొక్కాల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ వెళ్లి.. పింఛను అందించి..


విజయవాడలో వృద్ధురాలికి పింఛను అందజేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్, వలంటీర్

కపిలేశ్వరపురం: స్థానిక సచివాలయం-01 పరిధిలో వృద్ధాప్య పింఛను లబ్ధిదారిని తాతవోలు సూరమ్మ అనారోగ్యంతో విజయవాడలోని బంధువుల ఇంటిలో ఉంటూ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ సూరంపూడి సతీష్, వలంటీర్ కుప్పాల త్రినాథ్ విజయవాడ వెళ్లి పింఛను సొమ్ము అందజేశారు. 200 కిలో మీటర్లు దూరం ప్రయాణించి పింఛను అందజేసిన వెల్ఫేర్ అసిస్టెంట్, వలంటీర్‌లను గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు అభినందించారు.

మొబైల్ షాప్ ఓనర్స్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

రామచంద్రపురం: పట్టణంలోని మొబైల్ షాప్ ఓనర్స్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు కంచుమర్తి బాబూరావు నేతృత్వంలో ఎన్నికలు జరిగాయి. అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా గంగరాజు వెంకటేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్‌గా మేడపాటి భార్గవ్‌రెడ్డి, సెక్రటరీగా పెరుమాళ్ల శ్రీరాజా, జాయింట్ సెక్రటరీగా ద్వారంపూడి వెంకటరెడ్డి, ట్రెజరర్‌గా తేలు సూర్య నాగేశ్వరరావు, మెంబర్లుగా కర్రి నాగరాజు, పెదపాటి త్రినాథ్, కల్లూరి భాస్కరరావు, పసల సురేష్, పోతాబత్తుల రాము, మేడిశెట్టి వెంకట దుర్గాప్రసాద్, ముఖ్య సలహాదారులుగా రాయుడు దేవి ప్రసాద్, మన్ని వీరభద్రరావులు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. నూతన కార్యవర్గాన్ని రామచంద్రపురం పట్టణ ఛాంబర్ ఆఫ్ కామర్స్ పెద్దలు, పట్టణ ప్రముఖులు అభినందించారు.

సమాజ నిర్దేశకులు ఉపాధ్యాయులు

- ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి
- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడం ద్వారా విలువలతో కూడిన సమాజ నిర్మాణానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఎస్‌టీయూ మండపేట పట్టణ, మండల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా 76వ జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశాలు ఆదివారం స్థానిక సీతారామ కమ్యూనిటీహాలులో జరిగాయి. సంఘ జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి శివప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్సీ తోట, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, ఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు లంకలపల్లి సాయిశ్రీనివాస్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యారంగంలో తీసుకొస్తున్న మార్పుల వల్ల ఉపాధ్యాయులు ఒత్తిడికి గురికావాల్సి వస్తోందని, ప్రభుత్వం స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగా పరిరక్షణకు, బడుగు బలహీన వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అనంతరం ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్యారంగానికి పెద్దపీట వేస్తున్నారన్నారు. క్షేత్రస్థాయిలో ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని ఎమ్మెల్సీ తోట హామీ ఇచ్చారు. మున్సిపల్ చైర్‌పర్సన్ దుర్గారాణి మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణలో ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని అభినందించారు. అనంతరం ఎమ్మెల్సీ తోట, చైర్‌పర్సన్ దుర్గారాణిలను ఘనంగా సత్కరించారు. దివంగత ఉపాధ్యాయులకు సంబంధించి ఒక్కొక్కరికి రూ. రెండు లక్షలు చొప్పున ముగ్గురు ఉపాధ్యాయుల కుటుంబాలకు రూ.ఆరు లక్షల ఆర్థిక సహాయాన్ని మాజీ ఎమ్మెల్సీ, కిమ్స్ అధినేత చైతన్యరాజు చేతుల మీదుగా అందజేశారు. కౌన్సిలర్ గ్రంధి శ్రీనివాస్, ఎస్‌టీయూ పోతంశెట్టి దొరబాబు, నల్లి ప్రసాద్, కేవీఎస్ ఆచారి, సీహెచ్ ఉమాపతిశాస్త్రి, శోభావళి, దంటు శ్రీనివాస్, కూసు వీర్రాఘవులు, టీవీవీ వేణుగోపాల్, వఱ్ఱే సత్యనారాయణ, ఇందిర, నాయుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.


ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులును సత్కరిస్తున్న ఎస్‌టీయూ నాయకులు, చిత్రంలో చైర్‌పర్సన్ దుర్గారాణి

సొంతూరిపై మమకారం చాటుకున్న వైద్యులు

- ఏడిదలో పూర్వ విద్యార్థుల మెగా వైద్యశిబిరం
- సేవలందించిన గ్రామానికి చెందిన డాక్టర్లు
- 1200 మందికి వైద్య పరీక్షలు

మండపేట: వివిధ ప్రాంతాల్లోని ప్రముఖ ఆస్పత్రుల్లో వైద్యనిపుణులుగా పేరొందారు. గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థులు తలపెట్టిన వైద్య శిబిరంలో సొంతూరి ప్రజలకు సేవ చేయాలని తరలివచ్చారు. 1200 మందికి వైద్య పరీక్షలు చేసి, సేవలందించారు. మండలంలోని ఏడిద జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 1980–85 పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యసేవలందించేందుకు ప్రముఖ ఆస్పత్రుల్లోని తమ గ్రామానికి చెందిన వైద్యనిపుణులను ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరంలోని ప్రముఖ లేప్రోస్కోపిక్, జనరల్ సర్జన్ రిమ్మలపూడి భాస్కరచౌదరి, జనరల్ ఫిజీషియన్ చైత్ర, లేజర్, లేపరోస్కోపిక్ సర్జన్ రిమ్మలపూడి నితిన్, మానసిక వైద్యనిపుణులు కె.రోహిత్, స్త్రీ వైద్యనిపుణురాలు కె.అమూల్యభావన, దుళ్లలోని సుగర్ వ్యాధి వైద్యనిపుణులు జీసీ పట్టాభిరామయ్య, మండపేటలోని చిన్న పిల్లల వైద్యనిపుణులు కొలుపోటి జానకిరామ్ తదితర వివిధ ప్రాంతాల్లో పేరొందిన 13 మంది వైద్యులు సొంతూరికి తరలివచ్చారు. శిబిరానికి హాజరైన మరో ఎనిమిది మంది వైద్యులతో కలిసి ఏడిద, పరిసర గ్రామాలకు చెందిన దాదాపు 1200 మందికి వైద్యసేవలు అందించారు. సొంతూరి ప్రజలకు వైద్యసేవలు అందించడం ఎంతో ఆనందంగా ఉందని, కార్యక్రమం ఏర్పాటు చేసిన పూర్వ విద్యార్థులను ఈ సందర్భంగా భాస్కరచౌదరి తదితరులు అభినందించారు. శిబిరాన్ని ప్రారంభించిన గ్రామ సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల సేవలను ప్రశంసించారు. శిబిరంలో బీపీ, సుగర్, గుండె, ఎముకలు, ఊపిరితిత్తులు, మెదడు, నరాలు, క్యాన్సర్, చిన్నపిల్లలు, స్త్రీ సంబంధిత వ్యాధులకు సేవలు అందించి అవసరమైన ఉచితంగా మందులు అందజేశామని పూర్వ విద్యార్థులు తెలిపారు. ఆపరేషన్ అవసరమైన వారికి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్య శ్రీ పథకంలో ఆపరేషన్లు చేయిస్తామన్నారు. వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు, సొసైటీ చైర్మన్ రామిశెట్టి శ్రీహరిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు కుడిపూడి రాంబాబు, పలివెల సుధాకర్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.


వైద్యసేవలు అందిస్తున్న ప్రముఖ వైద్యులు పట్టాభిరామయ్య